

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

### తాయీ సాహెబా

**భాష:** కన్నడ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం – గిరీష్ కాసరవెల్లి; సినిమాటోగ్రఫీ– రామచంద్ర;

నిర్మాత – జయమాల; నటీనటులు – జయమాల, సురేష్

**విడుదల:** 1997

**భారతీయ** నవ్య చలన చిత్ర రంగంలో గిరీష్ కాసరవెల్లి తనదైన ఒక దృక్పధాన్ని చిత్రీకరణ శైలిని రూపొందించుకున్న దర్శకుడు. కర్నాటక నుంచి ఎదిగిన ఆయన గత ఇరవై ఏళ్ళకాలంలో నాలుగు చిత్రాలకు జాతీయ ఉత్తమ చిత్రం అవార్డులు అందుకున్నాడు. ఆయన ప్రతిభకు కేవలం అవార్డులే కొలబద్దలు కావు. ఆయన నిర్దేశకత్వంలో వెలువడ్డ ‘ఘటశ్రాద్ధ‘ నుంచి ‘తాయి సాహెబా‘ దాకా ఆయన ప్రస్థానాన్ని పరిశీలిస్తే, గత అనుభవం నుంచి, చారిత్రక విశ్లేషణ లోంచి వర్తమాన జీవితంపైన ఆయన చేసే వ్యాఖ్యానాలు కాసరవెల్లి చలన చిత్ర ధోరణిని, అవగాహనను విశదపరుస్తాయి. ఆయన సినిమాల్లో గోచరించే క్లాసికల్ నరేషన్ ఆయన ప్రతిభకు గీటురాయిగా నిలుస్తుంది.

గిరీష్ కాసరవెల్లి నిర్మించిన ‘ఘటశ్రాద్ధ‘లోను ‘తాయి సాహెబా‘లోనూ ముఖ్యాభినేతలు స్త్రీలే. ‘తాయిసాహెబా‘లో కథాగమనం యావత్తూ ఉపాఖ్యానాలుగా సాగుతుంది. చిత్రం మొత్తం తాయీసాహెబా చుట్టూ అల్లుకుని ఉన్నప్పటికీ స్వాతంత్ర్య పోరాటమూ అప్పాసాహెబ్ స్వాతంత్ర్య పోరాటమూ, ఆయన ముగ్గురు భార్యలు, బాబా సాహెబ్ దత్తత, నానూ – మంజిరిల ప్రేమ ఇలా

అనేక ఎపిసోడులుగా సాగే కథను దర్శకుడు కొనసాగించిన పద్ధతి విలక్షణంగా ఉండి ఆకట్టుకుంటుంది. చిత్రం ప్రధానంగా రెండు అంశాల్ని చర్చకు తెస్తుంది. మన జాతీయ స్వాతంత్ర్య పోరాటమూ, అది మహిళల్ని ఏ మేరకు తనలో భాగం చేసుకున్నది అన్నది ఒక అంశంకాగా, మహిళలకు సంబంధించిన లైంగికాంశాల్ని రెండో అంశంగా ముందుకు తెస్తుంది. ఇంకా ఈ చిత్రం మగవాళ్ళలో వేళ్ళూనికుని ఉన్న ఆధిపత్య ధోరణిని, ఫ్యూడల్ తత్వాన్ని, పితృస్వామ్య భావజాలాన్ని తాయీ సాహెబా ప్రశ్నిస్తుంది. ఈ చిత్రంలో స్వాతంత్రోద్యమం నాటి ఇతివృత్తాన్నే కథాంశంగా ఎన్నుకున్నప్పటికి నేటికి అన్వయింప వీలయిన అంశాన్ని తాయీసాహెబా రంగం మీదకి తెచ్చింది.

ఈ సినిమా ప్రధానంగా ఒక జమిందారీ భవంతిని వేదికగా చేసుకుని సాగుతుంది. జామ్‌ఖండ్ లోని ఒక భవంతిని చిత్రం కోసం ఉపయోగించుకున్నారు. విశాలమైన గదులు, ఎత్తైన ప్రాకారాలతో గొప్ప కట్టడంలా ఉన్న ఆ భవంతి నలుమూలల్ని పరిచయం చేస్తూ కెమేరా క్రమంగా వంటింటిలోకి వెళుతుంది. ఇక్కడే దర్శకుడు తాను ఆవిష్కరించదలచుకున్న ప్రధాన అంశాన్ని చూపిస్తాడు. విశాలమైన ఇంటిని ఆ పక్కనే ఉన్న వంటింటిని ప్రధానంగా చూపించడంలో juxtapose చేసి దర్శకుడు ఒక స్పేస్‌ని సృష్టిస్తాడు. అంటే ఆ ఇంట్లోని మహిళకు ఇతర మనుషులకు మధ్య గల అనుబంధమూ, సంఘర్షణా తదితరాంశాల్ని ఆ స్పేస్‌తో ముందుకు తెస్తాడు. ఇలా చిత్రంలో అనేక సందర్భాల్లో అనేక మానవ సంఘర్షణల్ని దర్శకుడు ప్రతిభావంతంగా ఆవిష్కరిస్తాడు. వంటింటికి, వడేకి (భవంతికి) పరిమితమైన తాయి సాహెబా క్రమంగా ఎదిగి బయటి ప్రపంచంలోకి రావడం చిత్రంలోని మూలాంశం.

చిత్రంలో కథ 20 ఏళ్ళ కాల పరిధిలో జరుగుతుంది. దేశానికి అపుడపుడే స్వాతంత్ర్యం వచ్చిన కాలం. స్వాతంత్ర్య పోరాటంలో తలమునకలై ఉన్న జమిందార్ అప్పా సాహెబ్ రెండవ భార్య తాయీసాహెబా. ఆమె పేరు నర్మద. ఆయన మొదటి భార్యకు పిల్లలు లేకపోవడంతో పూజలు పునస్కారాలతో గడుపుతుంది. అప్పా సాహెబ్‌కి బయట ఓ ప్రేయసి ఉంటుంది. ఆమె చంద్రి. జైలు నుంచి విడుదలైన అప్పా సాహెబ్ ఇంటికి వస్తున్నాడని తెలిసి నర్మద ఎంతో సంతోషిస్తుంది. కాని ఆయన నేరుగా చంద్రి వద్దకు వెళతాడు. అపుడపుడే చంద్రికి కూతురు మంజరి పుడుతుంది. ఆ తర్వాత అప్పాసాహెబ్ వడేకి వెళతాడు. పిల్లలు లేని తాయీ సాహెబా అతనికోసం ఎదురుచూస్తూ ఉంటుంది. అలసిపోయిన అప్పాకు నర్మద నూనెతో శరీరమంతా మర్ధన చేస్తుంది. అతని శారీరక స్పర్శతో నర్మద లైంగికంగా ఉద్రేకపడుతుంది. కానీ అప్పా అదేమీ లక్ష్యపెట్టడు. స్వాతంత్ర్య పోరాటాన్ని అర్థం చేసుకోకుండా చిన్న చిన్న విషయాల్ని పట్టించుకుంటోందని ఆమెను ఈసడిస్తాడు. అప్పటికే చంద్రి వద్దకు వెళ్ళొచ్చిన అప్పా నర్మద కోరిక తపనల్ని పట్టించుకోడు. ఆమె స్వాతంత్ర్య పోరాట చరిత్రను అర్థం చేసుకునేందుకు అప్పా సాహెబ్ నర్మదను కనీసం సంప్రదించకుండానే వెంకోబా కొడుకుని దత్తత చేసుకుంటాడు. తనకు కనీసం చెప్పలేదేమని ప్రశ్నిస్తుంది. 'నేటి వరకు ఏ విషయమూ ఇంట్లో వాళ్ళకి చెప్పి చేయలేదంటాడు' అప్పా. కొత్తగా వడేలోకి చేరిన నానూ పెంపకంలో నర్మద తనను తాను మరిచి పోతుంది. మాతృత్వంలో మునిగితేలుతుంది. అప్పాసాహెబ్ వేర్వేరు కారణాలతో జైలుకు వెళ్ళి రావడం జరుగుతూనే ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తమ భూముల్ని పేదలకు పంచి పెట్టాలంటాడు అప్పా. కాని తోటి జమిందార్లు అంగీకరించరు. అప్పాని కమ్యూనిస్టుగా ముద్రవేస్తారు. ఇంతలో ఎదిగిన నానూ చంద్రి కూతురు మంజరిని ప్రేమిస్తాడు. వారి ప్రేమ అందరినీ కలిచివేస్తుంది. వరసకు అన్నా చెల్లెలు అయ్యే వారి మధ్య ప్రేమ పెళ్ళి సమజసం కాదంటారు. నానూ మంజరిని మరవలేక ఉంటారని తెలుస్తుంది. ఆ వార్త విన్న తాయ్‌సాహెబా మొట్టమొదటిసారిగా వడేను వదిలి బయటకు వస్తుంది. అప్పా మూడవ భార్య చంద్రిని వెంట బెట్టుకుని జైళ్ళ చుట్టూ అప్పాని వెతుకుతూ తిరుగుతుంది. కులవివక్షతను, స్థాయిని తోసిరాజని తాయి చంద్రితో కలిసి వెళుతుంది. అప్పా మరణవార్త తెలుస్తుంది. అప్పటికే నానూ మానసిక స్థితిని అర్థం చేసుకున్న నర్మద నానూకు ఇష్టంలేని పనిచేయకూడదని, వడే బందిఖానాలో తనలాగే ఇష్టాన్ని కోరికల్ని చంపుకుని నానూ బతకరాదని తలుస్తుంది. ఒక న్యాయవాది సలహా తీసుకుని తప్పుడు స్టేట్ మెంట్ ఇచ్చి నానూ దత్తతను రద్దు చేస్తుంది. దత్తత రద్దయింది కనుక మంజరితో పెళ్ళికి నానూకు ఎలాంటి ఆటంకమూ లేదంటుంది. నానూ తండ్రి వెంకోబా మాత్రం తప్పుడు స్టేట్‌మెంటు ఇచ్చినందుకు

పోలీసులు అరెస్టు చేస్తారని భయపెడతాడు. తాయీసాహెబా అరెస్టుకయినా సిద్ధపడుతుంది. అప్పటిదాకా వడే గోడల్లో బతికిన తాయీ సాహెబా బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ ఏ బంధనాలు లేని స్వేచ్ఛను తన పెంపుడూ కొడుకు నానూకు కల్పిస్తుంది. తాను కూడా తనకు దుఃఖాన్ని కలిగించిన సవితి చంద్రిని మనిషిగా చేరదీస్తుంది. జమిందారీ బంధనాల్ని తెంచుకుని మనిషిగా అన్ని బంధనాల్ని తెంచుకుని వ్యక్తిగా నిలిచివుండే స్థాయిదాకా ఎదిగిన నర్మద జీవిత చిత్రీకరణను 'తాయీసాహెబా' విజయవంతంగా నిర్వహించింది. చిత్రీకరణ విషయంలో కూడా దర్శకుడి ప్రతిభ విలక్షణంగా సాగింది. బ్యాక్‌వర్డ్ నరేటివ్స్‌తో కథని అత్యంత ఆకర్షణీయంగా సాగించాడు. నర్మద నానూల మధ్య తల్లీ కొడుకుల అనుబంధాన్ని చిత్రించడంలోనూ గిరీష్ ప్రతిభ విలక్షణమైంది. మొత్తం మీద చారిత్రక కథని విశ్లేషిస్తూనే మహిళా వ్యక్తిత్వ పరిణామాన్ని దర్శింపచేసిన చిత్రం తాయీ సాహెబా.

●●●

## అహల్య

**భాష:** ఒరియా, **దర్శకత్వం** – బిజోయ్ కేతన్ మిశ్రా; కెమెరా – జుగల్ దెబతా;

**సంగీతం** – పండిట్ రఘునాథ్ పాణిగ్రాహి;

**నటీనటులు** – తనూజదేవి, జయప్రకాశ్

**విడుదల:** 1997

**అహల్య అనగానే మనకు పౌరాణికాల్లో కనిపించే** మహాసాధ్వి స్ఫురణలో కొస్తుంది. ఆమె మోసానికి గురవడం, శాపం పాలబడి జీవితమంతా బండరాయిగా మారిపోవడం ఎప్పుడో శ్రీరామచంద్రుడి పాదధూళితో ఆ రాయి కాస్తా పునురుజ్జీవం పొందడం ఇవన్నీ మనం కథలుగా చదువుకున్నాం. కాని అవి గత కథలే కావని ఇప్పటికీ పురుషస్వామ్య సమాజంలో స్త్రీల పరిస్థితిలో తేడా పెద్దగా లేదని గమనించవచ్చు. ఆనాటి అహల్యకు మృత్యువే విముక్తి అని వివరించే చిత్రం 'అహల్య'. బిజోయ్ కెతన్ మిశ్రా ఒరియాలో నిర్మించిన ఈ చిత్రం ప్రముఖుల ప్రశంసల్ని అందుకుంది. వాస్తవానికి ఒరిస్సాలో సినిమా రంగమే అంతంత మాత్రపు జీవనాన్ని సాగిస్తోంది. అందునా నిరద్ మహాపాత్రా, మన్ మోహన్ మహాపాత్ర, ఎకె బీర్‌లాంటి అతి కొద్ది మాత్రమే ఒరియాలో నవ్య చలన చిత్ర దృక్పథంతో చిత్రాలు నిర్మిస్తున్నారు. అలాంటి స్థితిలో బిజోయికేతన్ మిశ్రా, అహల్య లాంటి సబ్జెక్టును ఇతి వృత్తంగా తీసుకుని సినిమా నిర్మాణానికి ఉపక్రమించడం సాహసంతో కూడుకున్నదే. ఇప్పటికే పలు డాక్యుమెంటరీలు నిర్మించి జర్నలిస్టుగా సాంఘిక కార్యకర్తగా పనిచేస్తున్న మిశ్రా ప్రముఖ రచయిత లక్ష్మిప్రియ ఆచార్య రచించిన కథను ఆధారంగా చేసుకుని ఈ చిత్రం నిర్మించారు. ఇందులో మనసును వెంటాడే దృశ్యాలు, ఆలోచన రేకెత్తించే సన్నివేశాలు అనేకం ఉన్నాయి. అవన్నీ ఆలోచనాపరుల గుండెల్లో అనేక ప్రశ్నలు రేకెత్తించి ఉద్విగ్నపరుస్తాయి. చిత్రంలో ముఖ్యాభినేత అయిన అహల్య చిత్రంలో ఆద్యంతం మౌనంగానే ఉంటుంది. ఒక్కమాట మాట్లాడదు. అంతా నిశ్శబ్దంగానే దృశ్యబద్ధంగానే సాగిపోతుంది.

ఇవాళ్టి మన సమాజంలో వివక్షను, అధికార దర్పాన్ని అకృత్యాల్ని ఎదుర్కొనే స్త్రీలపట్ల సానుభూతితో చైతన్యంతో నిర్మితమైంది అహల్య. చలన చిత్రీకరణలో దర్శకుడి అపరిపక్వత ద్యోతకమవుతూనే ఉన్నప్పటికీ చిత్రంలోని విషయం మనల్ని కట్టిపడేసి ఉంచుతుంది. దర్శకుడి పట్ల అభినందనల్ని అందించేలా చేస్తుంది.

చిత కథాంశం విషయానికి వస్తే అహల్య పుట్టిన కొద్ది కాలానికే తండ్రిని పోగొట్టుకుంటుంది. పెళ్ళయిన తర్వాత కాపురం ఆరంభించకముందే భర్త చనిపోతాడు. ఆమె అత్తవారింట్లో అడుగు పెట్టకముందే మామ చనిపోతాడు. ఇలా వరుసగా ఎదురైన దుఃఖాలు, అపశృతులు ఆమెకు శాపాలవుతాయి. సంఘంలోని పెద్దలు వీటన్నింటి మధ్యా ఆమెకు తీవ్రమైన నిబంధనలు విధిస్తారు. ఎవరి నుంచి సహాయం సుహృద్భావం అందని ఆమె ఇంటి పనిమనిషి అయిపోతుంది. వయసుకు సంబంధించిన ఎలాంటి సంతోషాలు చవిచూడకూడదని ఆమెను శాసిస్తారు. ఇంట్లో ఉన్న మరో ఇద్దరు స్త్రీలు ఆమె వైధవ్యమే ఆమె సేవకురాలు అవడానికి కారణంగా నిర్ధారిస్తారు. తోటి ఆడవారినుంచే కనీస సహకారం అందని స్థితిలో ఆమె వంటింటికి, సేవలకూ పరిమితమైపోతుంది. తాను పుట్టిననాటి నుంచి జరిగిన ఏ సంఘటనకూ, కలిగిన ఏ మరణానికి కారణం కాని ఆమెను అన్నింటికీ బాధ్యురాలిని చేసి శిక్షకు గురిచేస్తుంది లోకం. ఆమె మౌనంగా అన్నీ సహిస్తుంది. ఇంట్లోని ఇద్దరు మగవాళ్ళు మాత్రం ఆమె పట్ల దయను ప్రేమను ప్రదర్శిస్తారు. అందులో టికన్ ఆమెను తల్లిలా భావిస్తాడు. టికన్‌ని తన సొంత కొడుకులా భావిస్తుందామె. కాని ఆ ఇంట్లో స్త్రీలు పెట్టిన ఆంక్షలు వారిని కూడా అహల్య నుంచి దూరం చేస్తాయి.

ఇలాంటి తీవ్రమైన ఒత్తిడుల మధ్య సొంత ఆలోచనని గౌరవాన్ని పోగొట్టుకుని అహల్య తన దురదృష్టం పేర దుఃఖంలో మిగిలిపోతుంది. కాలం గడిచిపోతూ ఉంటే కలిగే పరిణామాలకు లొంగిపోతూ ఆమె జీవనం సాగిపోతుంది. అయితే ఆమె వేదనకి దుఃఖానికి విమోచన జీవితంలో కాకుండా మరణంలో లభిస్తుంది.

అలా 'అహల్య' నిరాశామయ ధ్వనితో ముగుస్తుంది. ఇందులో కథలో కొత్తదనం కాని కథనంలోన వైవిధ్యం కాని లేవు. వైధవ్యాన్ని గురించి ఇప్పటికే మన దేశంలో అనేక చిత్రాలు వచ్చాయి. అయితే ఎవరి దృక్కోణం వారిది. బిజోయ్ కెతన్ మిశ్రా 'అహల్య' చితంలో అహల్య ఆద్యంతం ఒక్క మాటా మాట్లాడకపోవడం మౌనంగానే ఆమె తన దుఃఖాన్ని అణిచివేతని ప్రకటించడం గొప్ప విషయం.

స్త్రీ జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకుని స్వల్ప వ్యవధిలోనే అయినా మంచి ప్రయత్నం చేసిన మిశ్రాను అభినందించక తపదు. వెనకబడ్డ రాష్ట్రాల నుంచి ఈ మాత్రపు ప్రయత్నాలు రావడం హర్షణీయం. ఒరియాలో 'అహల్య'ను మంచి చిత్రంగానే పరిగణించవచ్చు.

●●●

Click here to share your comments on this article.